క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు నగర కమిషనర్ వెంకటకృష్ణ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం ఏలూరు ఇండోర్ స్టేడియం వద్ద పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు, మహిళలు పచ్చదనం, పర్యావరణం కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం పెద్ద ఎత్తున మొక్కల పెంపకం చేపట్టిందన్నారు. నగరంలో ఆహ్లాదకర వాతావరణ కోసం వంతెన, రోడ్లు పక్క మొక్కల కుండీలు ఏర్పాటు చేసామన్నారు. రోడ్లు మధ్య డివైడర్ సైతం పచ్చదనంతో నింపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు పలు రకాల నినాదాలతో కూడిన ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నగర వాసులను ఆకట్టుకున్నారు.

పుస్తకాల ద్వారానే భవిష్యత్తు



వెంకటేశ్వర్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రంథాలయ ప్రతినిధులు, పాఠకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పుస్తకాల ద్వారానే విద్యార్థులకు, నేటి యువతకు మంచి భవిష్యత్ లభిస్తుందని తెలుగు భాష అభివృద్ధి కోసం పిల్లలు సెల్‌ఫోన్లు ఒదిలి పుస్తకాలు పట్టాలని ప్రచారం చేయడం కోసం మరో గ్రంథాలయ ఉద్యమం చేపట్టామని మంచికంటి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 19న వెంకటేశ్వర్ రెడ్డి ఒంగోలులో ప్రారంభించిన బైకు యాత్ర బుధవారం నగరానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ మరో గ్రంథాలయ ఉద్యమం ద్వారా రాయలసీమ జిల్లాలన్నీ తిరిగి విజయవాడ మీదుగా ఏలూరుకు చేరుకున్నామన్నారు. తాను అనేక కథలు, కవితలు, నవలలు రచించానని, ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో బీఈడీ చేశానన్నారు. నేటి విద్యా విధానంతో విద్యార్థుల్లో మానసిక వికాసం మృగ్యమైపోతోందని, విజ్ఞానం లక్ష్యంగా కాక కేవలం ఉద్యోగమే లక్ష్యంగా నేటి విద్య కొనసాగుతోందన్నారు. తన యాత్రలో భాగంగా ఆయా ప్రాంతాల్లోని రచయితలు, ప్రజా సంఘాలు, సాహిత్యవేత్తలతో కలిసి సమావేశాలు నిర్వహించి వారితో రాష్ట్రస్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యక్రమాల నిర్మాణం చేస్తామన్నారు. గ్రంథాలయ నిర్వహణ అధికారి బందెల రమేష్ కృష్ణారావు ఆయనకు స్వాగతం పలికారు.

విద్యార్థుల చూపు.. ప్రభుత్వ బడుల వైపు

- ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వలసలు
- విద్యా సంక్షేమంపై తల్లిదండ్రుల విశ్వాసం
- ఊపందుకున్న ప్రవేశాలు





ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించడానికి తల్లిదండ్రులతో చర్చిస్తూ ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల పేర్ల నమోదు చేసుకుంటున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మన బడి, నాడు – నేడుతో పాఠశాల భవనాలు, తరగతి గదులు ఆహ్లాదకరంగా మారాయి. తమ పాఠశాల విద్యార్థులంతా ర్యాంకులు సాధించే స్థాయిలో మార్కులు తెచ్చుకోవాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే తపన విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. దానికి నిదర్శనమే 2022–23 విద్యా సంవత్సరంలో వెలువడిన 10వ తరగతి ఫలితాలు. కార్పొరేట్ విద్యార్థులను మించి 600 మార్కులకు 580 నుంచి 596 మార్కుల వరకు ప్రభుత్వ పాఠశాలల్లో వందలాది మంది విద్యార్థులు సాధించారు. అటువంటి విద్యార్థులను ప్రోత్సహించడానికి, ఇతర విద్యార్థుల్లో పోటీతత్వం రగిలించడానికి ప్రభుత్వం నగదు పురస్కారాలు ఇవ్వాలని నిర్ణయించింది. కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తేనే ర్యాంకులు వస్తాయన్న ఆలోచనతో ఆర్థికంగా భారమైనా పేద కుటుంబాల వారు సైతం ప్రైవేటు విద్యా సంస్థల్లో తమ బిడ్డలను చదివించడానికి ఆసక్తి చూపేవారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే ఒక్కరూపాయి కూడా ఖర్చు లేకుండానే ర్యాంకులు రావడంతో పాటు తమ బిడ్డలకు సర్కారు ఎదురు నగదు ఇచ్చే అవకాశం ఉండడంతో తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడానికి ముందుకు వస్తున్నారు.

నూతన ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా విద్యార్థులు ప్రవేశించేందుకు ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తోంది. క్లస్టర్ రీసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు తమ పాఠశాలల పరిధిలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలతో పాటు విద్యా సంక్షేమ పథకాలను సైతం వారికి విపులంగా వివరిస్తున్నారు. కార్పొరేట్ తరహా బట్టీ విధానంలో కాకుండా ప్రభుత్వ బడుల్లో ప్రణాళికాబద్ధంగా ఉండే బోధనాపద్ధతుల్లో పాఠాలు చెబుతున్నారు. విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచడానికి ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను చెబుతున్నారు. ట్యాబులతో విద్య, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు వంటి ఎన్నో సాంకేతిక విద్యావకాశాలు ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని విశ్వాసం కలిగిస్తున్నారు.

సాదరంగా ఆహ్వానిస్తున్న ప్రభుత్వ బడి

పేద విద్యార్థులతో పాటు దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వ బడులు సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న నాడు – నేడు కార్యక్రమంతో పాఠశాలల స్వరూప స్వభావాలు పూర్తిగా మారిపోతున్నాయి. పాఠశాల ప్రధాన ద్వారం పక్కనే ప్రహరీ గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలతో విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. లోపలికి అడుగుపెట్టిన తరువాత అత్యద్భుతంగా తీర్చిదిద్దిన తరగతి గదులు, ప్రతి తరగతి గదిలో ఫ్యాన్లు, లైట్లు, విద్యార్థులు కూర్చోవడానికి కార్పొరేట్ తరహా బెంచీలు, డెస్కులు, విద్యార్థులు తాగడానికి ఆర్వో ప్లాంటు ద్వారా తాగునీటి సౌకర్యం, జగనన్న గోరుముద్ద ద్వారా మధ్యాహ్న భోజనంలో రోజుకో కొత్త రుచితో భోజనం, ఆహ్లాదకరమైన క్రీడా ప్రాంగణం ఇలా ప్రతి సౌకర్యం విద్యార్థులకు స్వాగతం పలుకుతోంది.

అందరికీ జగనన్న విద్యాకానుక

జగనన్న విద్యాకానుక ద్వారా నూతన యూనిఫారం, బూట్లు, స్కూల్ బ్యాగ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, తదితర విద్యా వస్తువులు కూడా విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. దీనితో అన్ని వర్గాల విద్యార్థులు ఇటీవల కార్పొరేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల వైపు వలస వస్తున్నారు.

నియోజకవర్గంలో 1,468 నూతన ప్రవేశాలు

ఏలూరు నియోజకవర్గంలో 2023–24 విద్యా సంవత్సరానికి వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పలు తరగతుల్లో కొత్తగా 1,468 ప్రవేశాలు పొందారు. వారి వివరాలు పాఠశాలల వారీగా ఇలా ఉన్నాయి.

ప్రాంతం	పాఠశాలలు	ప్రస్తుత విద్యార్థులు	ప్రవేశం పొందిన వారు
ఉన్నత పాఠశాలల్లో..			
ఏలూరు మండలం	08	2,703	329
ఏలూరు నగరం	15	6,127	546
ప్రాథమికోన్నత పాఠశాలల్లో..			
ఏలూరు మండలం	57	8,398	525
ఏలూరు నగరం	65	10,437	709
ప్రాథమిక పాఠశాలల్లో..			
ఏలూరు మండలం	49	5,695	196
ఏలూరు నగరం	50	4,310	163

తల్లిదండ్రులు, విద్యార్థుల విశేష స్పందన



ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు అటు విద్యార్థుల నుంచి, తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ కార్యక్రమాలు వారిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ బడులతో తమకు ఉజ్వల భవిష్యత్తు అందుతుందనే విశ్వాసం వారిలో వ్యక్తమౌతోంది. ఆశించిన దానికంటే ఎక్కువగా ఈ ఏడాది నూతన ప్రవేశాలు జరిగాయి. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా తమ పరిధిలోని పాఠశాలలో సంప్రదించవచ్చు.

– సబ్బితి నరసింహ మూర్తి, ఏలూరు మండల విద్యాశాఖాధికారి

ఐ లవ్ ... ఏలూరు

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతూ నిర్మాణాలు



ఏలూరు ఎన్ఆర్‌పేట జెడ్పీ కార్యాలయం సమీపంలో ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటేన్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు. ఎమ్మెల్యే ఆళ్ళనాని ప్రత్యేక శ్రద్ధతో నగరంలో పలు అభివృద్ధి పనులకు ఏలూరు కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయటంతోపాటు, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు కార్యచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరు నగరంలో ఎన్ఆర్‌పేట ప్రధాన రహదారిపై జెడ్పీ కార్యాలయ సమీపంలో, కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారి వద్ద ఐ లవ్ ఏలూరు అనే పేరుతో ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటేన్ నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కావస్తుండగా త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సైతం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. నగరంలో పాత బస్టాండ్ సెంటర్, శాంతినగర్ లోని సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా కూడలిలో, కంద్రిక గూడెం సెంటర్‌తో పాటు పలు ప్రాంతాల్లో వాటర్ ఫౌంటేన్ నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు.

కార్పెంటర్ పనులు విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే భవన నిర్మాణాలు, మన బడి నాడు – నేడుకు సంబంధించిన పనుల్లో కార్పెంటర్ పనులను విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి కార్పొరేషన్ ఎండీ కృష్ణ మోహన్‌ను కోరారు. బుధవారం విజయవాడలోని బీసీ భవనంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీ కృష్ణమోహన్ సమక్షంలో నిర్వహించిన బోర్డు సమావేశం వివరాలను ఏలూరులో ఆయన విడుదల చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో విశ్వబ్రాహ్మణుల భవనం నిమిత్తం స్థలం కేటాయించాలని కోరామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, కడపకు చెందిన డైరెక్టర్ గుడ్లవీడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాకు ఒక కలప సామిల్ డిపో ఏర్పాటుకు విశ్వబ్రాహ్మణులకు లైసెన్స్ ఇవ్వాలని, స్వర్ణకారులకు సంబంధించి 272 జీవోలో సవరణ చేయాలని, రాష్ట్రంలో ఉన్న దేవాలయాల్లో విశ్వబ్రాహ్మణులకు చైర్మన్ స్థానానికి 30 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారన్నారు. శ్రీకాళహస్తిలో 1.50 ఎకరాల భూమి ఇవ్వాలని, తిరుమల తిరుపతిలో బ్రహ్మంగారి మఠానికి స్థలం కేటాయించాలని, విశాఖపట్నం, అమరావతిలో వసతి భవనాలకు స్థలాలు ఇవ్వాలని, విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన వారికి ఎమ్మెల్సీ కేటాయించాలని, తాళిబొట్లు చేసే హక్కు విశ్వబ్రాహ్మణులకే అని చట్టబద్ధత కల్పించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు సంవత్సరాలు పదవీ కాలం పూర్తి చేసుకుని బీసీలకి అనేక రాజకీయ పదవులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ధన్యవాదాలు తెలియజేశారు.



విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ బోర్డు సమావేశంలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	50
వంకాయలు (తెలుపు)	00	ములక్కాడలు	05-07
బెండకాయలు	26	కంద	58
పచ్చిమిర్చి	44-50	బీట్‌రూట్	34
కాకర కాయలు	46	కీరా దోస	40
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	116
బీరకాయలు (పందిరి)	48	అల్లం	220
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	12	బఠాణి	--
ఆనబకాయ (1)	10	క్యాప్సికమ్	100
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	36

వైభవంగా కోదండ రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

దెందులూరు: పోతునూరులోని కోదండ రామాలయంలో సీతారామలక్ష్మణ, భరత ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా హోమాలు, పూజలు, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, రామచంద్రరావుకు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వందేళ్ల నాటి కోదండ రామాలయం శంకుస్థాపన గతంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని చేసిన సంగతి విదితమే. గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పాడిపంటలతో తులతూగాలని భారీ హోమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతులతో అభిషేకం చేసి గోమాతకు పూజ చేశారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి భక్తులు తరలివచ్చారు. విజయవాడ కనకదుర్గమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ తొత్తడివేదకుమారి, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా చైర్మన్ గూడపాటి పవన్‌కుమార్, దెందులూరు ఎంపీపీ సుమలత, సర్పంచ్ బోదుల స్వరూప్ పాల్గొన్నారు.

ఎస్సీ రైతులు ఆర్థికంగా ఎదగాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రకృతి వ్యవసాయం చేస్తున్న షెడ్యూల్డు కులాలకు చెందిన రైతులు ఆర్థికంగా ఎదగడానికి, వ్యవసాయ రంగంలో పారిశ్రామిక వేత్తలుగా మారడానికి అగ్రి ఎంటర్ ప్రేన్యూర్షిప్ డవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు సీడాప్ ఈడీ జీ. పార్థసారథి తెలిపారు. పీఎం అజయ్ 2021–22 ఏపీ ఎస్సీ కార్పొరేషన్, ఏఎస్‌సీఐ, సీడాప్ ద్వారా ఏలూరు జిల్లాలో ఉన్న వైటీసీ కేంద్రంలో మే 29న ఏర్పాటు చేసిన 10 రోజుల శిక్షణ తరగతులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా నుంచి ఆర్‌వైఎస్ఎస్ ద్వారా ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జీ. సునీల్ రాజ్ కుమార్ ఈ నెల 30న శిక్షణ కేంద్రాన్ని సందర్శించి రైతులకు శిక్షణ ప్రాముఖ్యతను తెలియజేసి, వసతి సదుపాయాలను తనిఖీ చేశారని తెలిపారు.

నేటి నుంచి శ్రీరామ్‌నగర్‌లో గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్: ఈ నెల 1 నుంచి శనివారపుపేట శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డు గవరవరం చెరువుగట్టు వద్ద గంగానమ్మ సంబరాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ నిర్వాహకులు ఆళ్ల మోహనరావు తెలిపారు. ఉదయం 6 గంటలకు 108 బిందెల నీళ్లలో అమ్మవారి అభిషేకం చేపట్టి 9.31 నిమిషాలకు ఘటాల ఊరేగింపుతో పాటు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. 2వ తేదీ అమ్మవారి అష్టదిగ్బంధన, గణపతి పూజ, పంచగవ్యప్రాశన, మండపారాధన, సాయంత్రం జలవాసం, ధాన్యవాసంతో పాటు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 3వ తేదీ శాంతిహోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 4వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. వైభవంగా నిర్వహించే సంబరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	12
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	08
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	14
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	06
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	05
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	08
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	11
ఏలూరు – బీహెచ్ఈఎల్	22.15	34820	10
ఏలూరు –బీహెచ్ఈఎల్	09.00	4794	33
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	36
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	36
ఏలూరు –తిరుపతి	16.00	4830	23

పౌరహక్కులు ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలు



పౌరుహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, ప్రజలు

ఏలూరు రూరల్: పౌరహక్కులు ప్రజాస్వామ్య వ్యవస్థకు పట్టుకొమ్మలు, వాటిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఏలూరు తహసీల్దార్ బి సోమశేఖర్ అన్నారు. మంగళవారం ఏలూరు తూర్పువీధి గంగానమ్మ ప్రాథమికోన్నత పాఠశాలలో సివిల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడు తన హక్కులను పూర్తిగా అవగతం చేసుకుంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వాలు మరిన్ని చట్టాలు రూపొందించి హక్కుల కల్పిస్తున్నాయన్నారు. ఇటీవల విద్యాహక్కు, ఉపాధి హక్కులపై ప్రజలు ఎక్కువగా స్పందిస్తున్నారని గుర్తు చేసారు. దీనికి అనుగుణంగానే ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. ప్రతి పౌరుడికి ఉచిత విద్య అందించడంతో పాటు ఉపాధి కల్పనపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపుతున్నాయన్నారు. ప్రజలు సైతం హక్కులతో పాటు తమ బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోనటరింగ్ కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, ప్రవల్లిక, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాషా, ఎఎస్‌డబ్ల్యు త్రిమూర్తి, మెప్మా ఆర్పీ రమణతో పాటు రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఖాతాల్లోకి రైతు భరోసా పథకం నగదు

భీమడోలు: వైఎస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా మండలంలోని 4,337 మంది రైతులకు రూ.2.38 కోట్ల నగదును ఈనెల 1న గురువారం లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తారని మండల వ్యవసాయాధికారి ఎస్‌పీవీ ఉషారాణి బుధవారం తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రూ.5,500 చొప్పున వారి వ్యక్తిగత ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. దీనిపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని రైతులు, పాలకవర్గ సభ్యులు, సలహా సంఘం సభ్యులు తిలకించవచ్చని అన్నారు. ఈనెల 2వ తేదీ శుక్రవారం రెండో విడత వ్యవసాయ యంత్ర సేవా పథకంలో అర్హత గల సీహెచ్‌సీ గ్రూపు సభ్యులకు సబ్సిడీ నగదును జమ చేస్తారన్నారు. అర్హులైన వారి జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో పొందుపర్చినట్టు తెలిపారు.